

వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) కోటి రూపాయల విరాళం ఇచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోగల నివాసంలో సీఎం రేవంత్ రెడ్డికి ఆ చెక్కును అందజేస్తున్న బీవోబీ జీఎం రితేష్ కుమార్, డీజీఎం ఎంవీఎస్ సుధాకర్.

గోల్డ్ ఈటీఎఫ్‌లు భళా

మదుపరులకు సిరులు కురిపిస్తున్న పెట్టుబడులు • ఏడాదిలో 32 శాతానికిపైగా రాబడులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: బంగారం, వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్) పెట్టుబడిదారులకు సిరులు కురిపిస్తున్నాయి. మదుపరులకు తమ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోల్లో వైవిధ్యానికి బాగా కలిసొస్తున్న ఈ గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌లు.. అందుకు తగ్గట్టుగానే ఆకర్షణీయ రాబడులను పంచి పెడుతున్నాయి మరి. దీంతో దేశీయంగా ఇప్పుడు ఎక్కువ మంది ఇన్వెస్టర్లు వీటిల్లోనే పెద్ద ఎత్తున మదుపునకు దిగుతున్నారు. మార్కెట్‌లో ఒడిదొడుకులు, ఆర్థిక అస్థిరతల మధ్య ఇన్వెస్టర్లకు సురక్షితమైన పెట్టుబడి సాధనంగా గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌లే కనిపిస్తున్నాయి. పారిశ్రామిక రంగాల నుంచైతే సిల్వర్ ఈటీఎఫ్‌లకు భారీగా ఆదరణ లభిస్తున్నది.

ఏడాది వ్యవధికి పెట్టుబడులపై రాబడుల తీరిది..

ఫండ్ పేరు	రాబడి
ఎడిల్‌వీజ్ గోల్డ్ అండ్ సిల్వర్ ఈటీఎఫ్ ఎఫ్‌వోఎఫ్	32.10%
ఎస్బీఐ గోల్డ్ ఫండ్	28.80%
యాక్సిస్ గోల్డ్ ఫండ్	28.63%
ఇన్వెస్కో ఇండియా గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్‌వోఎఫ్	28.59%
నిప్పాన్ ఇండియా గోల్డ్ సేవింగ్స్ ఫండ్	28.52%
హెచ్‌డీఎఫ్‌సీ గోల్డ్ ఫండ్	28.51%

గోల్డ్ ఈటీఎఫ్‌లు అంటే?

గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ అనేది ఓ కమోడిటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్. ఇది బంగారంపై పెట్టుబడులు పెడుతుంది. వ్యక్తిగత స్టాక్స్ తరహాలోనే వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో ఇవి ట్రేడ్ అవుతాయి. డీమెటీరియలైజ్డ్ (డిజిటల్ లేదా ఎలక్ట్రానిక్), పేపర్ రూపంలో ఇక్కడ భౌతిక బంగారం ఉంటుంది. బంగారానికి బదులుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు అవి ట్రేడ్ అయినప్పుడు నగదు రూపంలో వారి ఖాతాల్లో యూనిట్ల (యూనిట్ అంటే ఒక గ్రాము)కు సమానంగా జమవుతుంటాయి. ఇక దేశీయ మార్కెట్‌లో భౌతిక బంగారం ధరలకు అనుసంధానమై వీటి విలువ ఉంటుంది. ధరలు పెరిగితే పెరగడం.. తగ్గితే తగ్గడం జరుగుతుంది. సిల్వర్ ఈటీఎఫ్‌లూ ఇంతే.

లాభాలివీ..

గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌లను మార్కెట్ ట్రేడింగ్ సమయాల్లో సులభంగా అమ్ముకోవచ్చు లేదా కొనవచ్చు. ధరలు పారదర్శకంగా ఉంటాయి. ఇక భౌతిక బంగారం మాదిరి వీటిని ఇండ్లలో, లాకర్లలో నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదు. అపహరణ సమస్యలుండవు. రూ.100 నుంచి కూడా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అయితే మార్కెట్ రిస్కులకు లోబడి ఈ పెట్టుబడులుంటాయి. కాబట్టి పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవాలి.

పన్ను ప్రోత్సాహం

గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులకు మదుపరులు ఇంతలా ఆసక్తి కనబర్చడం వెనుక పన్ను ప్రోత్సాహకాలూ ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఈ ఏడాది జూలైలో లోక్‌సభలో ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో పన్నులను సవరించడం ఈ ఈటీఎఫ్‌లను మరింత ఆకర్షణీయం చేసింది. జూలై 23 నుంచి కొత్త పన్నులు అమల్లోకి వచ్చాయి. వీటి ప్రకారం ఏడాదికిపైగా ఉంచుకున్న ఈటీఎఫ్‌లను అమ్మడం ద్వారా పొందే లాభాలపై 12.5 శాతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడుతుంది. ఏడాదిలోపే అమ్మేస్తే సదరు మదుపరి ఆదాయ పన్ను (ఐటీ) స్లాబ్ రేటు ప్రకారం పన్నులుంటాయి.

సైయెంట్ లాభంలో వృద్ధి

హైదరాబాద్, అక్టోబర్ 24: ప్రముఖ ఐటీ సేవల సంస్థ సైయెంట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి గాను పన్నులు చెల్లించిన తర్వాత రూ.177 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 2.3 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ రూ.1,450 కోట్ల ఆదాయాన్ని గడించింది. గత త్రైమాసికంలో ఆశాజనక పనితీరు కనబరిచినట్లు సైయెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎండీ కృష్ణ బొడనపు తెలిపారు.

కోరమాండల్ 800 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, అక్టోబర్ 24: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కాకినాడ ఎరువుల ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, గుజరాత్‌లో మల్టీ-ప్రొడక్ట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో కాకినాడ ప్లాంట్లో కాంప్లెక్స్, యూనిక్యూ ఎరువుల కెపాసిటీ 7.5 లక్షల టన్నులకు చేరుకోనున్నది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.7,509 కోట్ల ఆదాయంపై రూ.696 కోట్ల నికర లాభాన్ని గడించింది.

రాష్ట్రంలో 'షూఆల్స్' స్మార్ట్ బూట్ల తయారీ!

300 కోట్లతో ఏర్పాటుకు ముందుకొచ్చిన కొరియా సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): మెడికల్, స్మార్ట్ బూట్ల తయారీలో అగ్రగామి సంస్థయైన కొరియాకు చెందిన 'షూఆల్స్'..తెలంగాణలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి 750 ఎకరాల స్థలం కావాలని, దీంట్లో రూ.300 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక షూ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పుతామని షూఆల్స్ ప్రతినిధులు కోరినట్టు ఆయన వెల్లడించారు. 87 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే 'గిగా ఫ్యాక్టరీ' ప్రతిపాదన కూడా కంపెనీ ప్రతినిధులు చేసినట్లు మంత్రి చెప్పారు. అడుగు భాగాన మెడికల్ చిప్ ఉండే బూట్లతో పదివేల అడుగులు వేస్తే గంటకు 25 వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే షూతోపాటు డయాబెటిస్, ఆర్థరైటిస్ ఉన్నవారికి ఉపశమనం కలిగించే పలు రకాల ఉత్పత్తుల తయారీకోసం 750 ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారని తెలిపారు. ఈ ప్లాంట్లో తయారుకానున్న ఉత్పత్తులు దేశీయ అవసరాలతోపాటు అమెరికా తోపాటు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయాలనుకుంటున్నది. బూట్ల అడుగు భాగాన జీపీఎస్ ఉండే షూలతో పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా ట్రాక్ చేయవచ్చని తెలిపారు. ఈ షూ ధరించిన వారు ప్రమాదానికి గురైనా, మరే ఆపదలో చిక్కుకున్నా కుటుంబ సభ్యులకు సిగ్నల్స్ వెళ్లనున్నాయి.

5000 ఎకరాల్లో స్మార్ట్ హెల్త్ సిటీ ఏర్పాటు

అమెరికాలోని జాన్ హాప్కిన్స్ లాంటి ప్రఖ్యాత హాస్పిటళ్లను తీసుకురావడంతో పాటు పరిశోధన కేంద్రాలు, బయో మెడికల్ సెంటర్లు, యాన్సిలరీ పరిశ్రమల కోసం 5,000 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే ఆసియాలో ఎక్కడా లేని విధంగా స్మార్ట్ హెల్త్ సిటీని నెలకొల్పే ప్రతిపాదన కూడా కొరియా బృందం చేసిందని శ్రీధర్ బాబు తెలిపారు.

పెట్టుబడులకు రైన్‌ల్యాండ్ రాష్ట్రం ఆసక్తి

రాష్ట్రంలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్రం ఆసక్తి కనబరుస్తున్నదని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రైన్‌ల్యాండ్‌కు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంతోపాటు చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కలిసి సచివాలయంలో శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ప్యూర్ ఈవీ దివాలీ ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 24: ప్యూర్ ఈవీ.. దీపావళి పండుగను దృష్టిలోపెట్టుకొని ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన సరికొత్త మోటర్‌సైకిళ్లపై రూ.20 వేల వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. వచ్చే నెల 10 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్లతో ఈ బైకుల ప్రారంభ ధర రూ.99,999కి తగ్గనున్నది. అడ్వాన్స్ ఫీచర్లతో రూపొందించిన ఎకో డ్రైఫిట్, ఈట్రైస్ట్ ఎస్ఎల్ క్లౌడ్ అలర్ట్, స్మార్ట్ బ్యాటరీ మేనేజ్‌మెంట్, సింగిల్ చార్జింగ్‌తో 171 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ దొంగారి మాట్లాడుతూ..కాలుష్యాన్ని తగ్గించడానికి అధిక ప్రాధాన్యతనివ్వడంలో భాగంగా ఈవీల కొనుగోళ్లను ప్రోత్సహించడానికి ఈ ఆఫర్లను తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఇండస్ట్రీకి టీజీఐఐసీ షాక్

భూ కేటాయింపులు రద్దు చేస్తామంటూ నోటీసులు

- **మౌలిక సదుపాయాల్లేకున్నా పరిశ్రమ పెట్టాల్సిందేనని ఒత్తిళ్లు**
- **రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కంపెనీ వర్గాల ఆగ్రహం**

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): 'గడువులోగా పరిశ్రమ ఏర్పాటు చేయనందుకుగాను మీకు కేటాయించిన భూమిని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలి' అంటూ పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టీజీఐఐసీ నోటీసులు జారీచేస్తున్నది. అయితే మౌలిక సదుపాయాలు కల్పించకుండానే భూములు కేటాయించి, తీరా వాటిని రద్దు చేస్తామనడం ఏమిటని వారంతా ప్రశ్నిస్తున్నారిప్పుడు. అయినా అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామనే చెప్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆయా కంపెనీల వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిజానికి కావాల్సిన అన్ని వసతులతో ఇండస్ట్రియల్ పార్క్‌లను అభివృద్ధి చేశాకే పరిశ్రమలకు టీజీఐఐసీ భూములు కేటాయించాలి. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిస్థితి ఇందుకు భిన్నంగా తయారైంది. ముందుగా భూములు విక్రయించి కనీస సౌకర్యాలు కల్పించకుండానే వదిలేస్తున్నారు. మాదారం, వర్గల్, బస్వాపూర్, బండ తిమ్మాపూర్, బండ మైలారం తదితర ప్రాంతాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇండస్ట్రియల్ పార్క్‌ల అభివృద్ధి మొదలైంది. అయితే ప్రభుత్వం మారిన తరువాత మౌలిక సదుపాయాల పనులు నిలిపివేశారు. అప్రోచ్ రహదారులు, అంతర్గత రోడ్లు, విద్యుత్తు సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, పచ్చదనాల్లేక సదరు భూములు వెలవెలబోతున్నాయి మరి. దీనిపై టీజీఐఐసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. తాజాగా టీజీఐఐసీ నోటీసులు పంపడం సర్వత్రా విమర్శలకు తావిస్తున్నదిప్పుడు.

నమ్మి నష్టపోయాం..

టీజీఐఐసీ వద్ద భూములు కొనుగోలు చేసినవారు తాము నష్టపోయామని ఆందోళన చెందుతున్నారు. ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ల్లో భూములు కొనుగోలుచేస్తే టైటిల్ క్లియర్‌గా ఉంటుందని, రుణాలు సులభంగా వస్తాయని, ప్రభుత్వం నుంచి రాయితీలు కూడా వెంటనే మంజూరవుతాయనుకుంటే.. పరిస్థితి మాత్రం భిన్నంగా తయారైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వం వద్ద నిధులుల్లేకనే మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని అధికారులు పరోక్షంగా తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి.

నాలుగోరోజూ నష్టాలే..

ఢిల్లీ, అక్టోబర్ 24: వరుసగా నాలుగో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టపోయాయి. ఎఫ్ఐఐల నిధుల వెనక్కి తీసుకోవడం, ఎఫ్ఎంసీజీ, వాహన రంగ షేర్లలో అమ్మకాలు జరగడంతో సూచీలు పతనం చెందాయి. సెన్సెక్స్ 16.82 పాయింట్లు కోల్పోయి 80,065.16కి, నిఫ్టీ 36.10 పాయింట్లు పతనం చెంది 24,399.40 వద్ద స్థిరపడింది. హెచ్‌యూఎల్ షేరు అత్యధికంగా 6 శాతం నష్టపోగా, నెస్లె, ఐటీసీ, మారుతి, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, లార్సెన్ అండ్ టుబ్రో, హెచ్‌సీఎల్ షేర్లు నష్టపోయాయి. కానీ, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, అదానీ పోర్ట్స్, ఎస్బీఐ, పవర్ గ్రిడ్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

రజిస్ట్రీ సం॰ డీ॰ ఎల॰-33004/99 | రిజిస్టర్ నం. డి.ఎల్-33004/99

सत्यमेव जयते

भारत का राजपत्र

భారత రాజపత్రం

సీ.జీ.-డీ.ఎల్.-అ.-16102024-257960

సిజి-డిఎల్-ఇ-16102024-257960

असाधारण

విశేష పత్రం

भाग II-खण्ड 3-उप-खण्ड (ii)

పార్ట్ II - సెక్షన్ 3 - సబ్ సెక్షన్ (ii)

प्राधिकार से प्रकाशित

అధికారిక ప్రకటన

సం. 4158] నం. 4158) | नई दिल्ली, मंगलवार, अक्तूबर 15, 2024/आश्विन 23, 1946 | న్యూ ఢిల్లీ, మంగళవారం, అక్టోబర్ 15, 2024/అశ్విణ 23, 1946

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

ప్రకటన

న్యూ ఢిల్లీ, 15 అక్టోబర్, 2024

S.O. 4522 (E)- జాతీయ రహదారుల చట్టం 1956 (48 ఆఫ్ 1956) (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును)లోని సెక్షన్ 3A లోని సబ్ సెక్షన్ (1) క్రింద జారీ చేసిన భారత రాజ పత్రం, విశేష పత్రం పార్ట్-II సెక్షన్-3 సబ్ సెక్షన్ (II)లో ప్రచురించబడిన రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం **S.O. 3673 (E) తేది 29-08-2024** యొక్క ప్రకటన ద్వారా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా లోని (ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల సెక్షన్) కి.మీ. 29.1 నుండి కి.మీ. 55 వరకు భూమి విస్తరణలో NH 63 బిల్డింగ్ (వెడల్పు చేయుట/ఫోర్-లేనింగ్ మొదలగునవి) నిర్వహణ మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కోసం సదరు ప్రకటనకు అనుబంధ షెడ్యూల్‌లో నిర్దేశిత భూమి సేకరణకు వారి ఉద్దేశం ప్రకటించినది.

సదరు నోటిఫికేషన్ ప్రధానాంశం సదరు చట్టంలోని సెక్షన్ 3A లోని సబ్-సెక్షన్ (3) క్రింద 05 సెప్టెంబర్ 2024న **''నమస్తే తెలంగాణ''** తెలుగు దినపత్రిక మరియు **''టైమ్స్ ఆఫ్ ఇండియా''** (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో ప్రచురించబడినది.

సెక్షన్ 3-సి క్రింద దాఖలైన అభ్యంతరాలను సమర్థ ప్రాధికారి స్వీకరించారు మరియు తగు విధంగా పరిశీలించి పరిష్కరించారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3D లో సబ్-సెక్షన్ (1)ను అనుసరించి సమర్థ ప్రాధికారి వారి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి దాఖలు చేశారు.

అందువలన ఇప్పుడు సమర్థ ప్రాధికారి యొక్క సదరు నివేదిక అందిన తరువాత సదరు చట్టంలోని సెక్షన్ 3D లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ పైన తెలిపిన ఉద్దేశ్యం కొరకు సదరు షెడ్యూల్‌లో తెలిపిన భూమిని సేకరించాలని కేంద్ర ప్రభుత్వం ఇందు మూలముగా ప్రకటిస్తుంది.

సదరు డిక్లరేషన్ సదరు చట్టంలోని సెక్షన్ 3డి క్రింద అవసరమైన విధంగా భారత రాజపత్రం, విశేషపత్రం, పార్ట్ II, **నెం. 3948 న్యూ ఢిల్లీ, మంగళవారం, అక్టోబర్ 1, 2024**లో ప్రచురించబడింది.

తదుపరిగా సదరు చట్టంలోని సెక్షన్ 3D లోని సబ్-సెక్షన్ (2)ను అనుసరించి అధికార రాజ పత్రంలో ఈ నోటిఫికేషన్ ప్రచురణపై కేంద్ర ప్రభుత్వం ఇందుమూలముగా ప్రకటన ఇస్తోంది. సదరు **షెడ్యూల్లో** పేర్కొనబడిన సదరు భూమి ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించి ఉంటుంది. ఏ తాకట్టు రుణ భారాలు లేకుండా ఉంటుంది.

అందువలన ఇప్పుడు సెక్షన్ 3Gలోని సబ్-సెక్షన్ (3)ను పాటిస్తూ సమర్థ ప్రాధికారి అనగా భూ సేకరణ కొరకు **రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ మరియు సమర్థ ప్రాధికారి, ఆర్మూర్ జిల్లా, నిజామాబాద్** వారి కార్యాలయములో ఈ బహిరంగ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **09-11-2024న సా 5.00 గం.** నాటికి **15 రోజుల** కాల వ్యవధిలోగా దిగువ ఇందులో ఇవ్వబడిన షెడ్యూల్‌లో తెలిపిన భూమికి సంబంధించి ఈ ప్రోసీడింగ్స్ క్రింద సేకరించబడే భూమి యజమానులు లేదా భూమిలో ప్రయోజనం గల వ్యక్తులందరిని వారి క్లైంలను దాఖలు చేయుటకు సమర్థ ప్రాధికారి ఇందుమూలముగా ఆహ్వానిస్తున్నారు.

సదరు భూమిలో ప్రయోజనం గల వ్యక్తులందరూ సదరు భూములలో వారి సంబంధిత ప్రయోజన స్వభావాన్ని తెలియజేస్తూ దిగువ పట్టికలో తెలిపిన తేదీన భూ సేకరణ కొరకు రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ కమ్ సమర్థ ప్రాధికారి **(CALA) NHAI, (NH 63) ఆర్మూర్, నిజామాబాద్** జిల్లా సమక్షంలో వారి భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు మరియు జిరాక్స్ కాపీలతో స్వయంగా లేదా ఏజెంట్ లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా హాజరు కావలసిందిగా సూచించబడుచున్నారు.

తెలంగాణ | **జిల్లా: నిజామాబాద్**

క్రమ సం.	మండలం పేరు	గ్రామం పేరు	విచారణకు తేది & సమయం	విచారణ ప్రదేశం
1	ఆర్మూర్	పెర్కిట్ (ఒజి)	11-11-2024న ఉ. 10.00 గం.	తహసీల్దార్ కార్యాలయం, ఆర్మూర్
2		కొత్త ఆర్మూర్		
3		చేపూర్		
4	మోర్తాడ్	డొంకల్	12-11-2024న ఉ. 10.00 గం.	తహసీల్దార్ కార్యాలయం, మోర్తాడ్
5		మోర్తాడ్		
6	కమ్మర్‌పల్లి	కమ్మర్‌పల్లి	13-11-2024న ఉ. 10.00 గం.	తహసీల్దార్ కార్యాలయం, కమ్మర్‌పల్లి

దిగువ షెడ్యూల్‌లో పేర్కొన్న భూములలో ప్రయోజనం గల వ్యక్తులందరూ (భూముల యజమానులు మరియు ప్రయోజనం గల ఇతర వ్యక్తులు) సదరు భూమిలో (వారి వాటా, భూమి ఏరియా దానికి అనుసంధానం చేసిన ఇతర ఆస్తులు ఉదా: కట్టడాలు/చెట్లు మొదలైనవి) మరియు సంబంధిత రికార్డులతో సహా సదరు భూములలో సంబంధిత ప్రయోజన స్వభావాన్ని తెలియజేస్తూ వారి క్లైమ్‌లను దాఖలు చేయాల్సిందిగా ఇందుమూలముగా సూచించ బడుచున్నారు. సదరు భూమి యజమానులు లేదా ప్రయోజనం గల వ్యక్తులు వారి పరిహారం మొత్తం జమ చేసేందుకు వారి బ్యాంక్ అకౌంట్ల వివరాలను తెలియజేయవలెను. సదరు క్లైమ్ లను దిగువ సూచనాత్మక ఫార్మేట్‌లో దాఖలు చేయవలెను.

గ్రామం/ పట్టణం పేరు	భూ యజమానులు ప్రయోజనం గల వ్యక్తి పేరు	ఫీల్డ్ సర్వే సం.	అతని/ఆమె వాటాలో భూమి విస్తీర్ణం	ఏవైనా కట్టడాలు / చెట్లు/గొట్టపు బావి భూమిపై ఉన్నవి	పాన్ నంబరు	అతను/ఆమె నిర్వహిస్తున్న ఖాతా ఉన్న బ్యాంక్ మరియు శాఖ పేరు	బ్యాంక్ ఖాతా నెం. బ్యాంక్ శాఖ మరియు IFSC కోడ్ వివరాలు

షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో కి.మీ. 29.1 నుండి కి.మీ. 55 వరకు (ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల సెక్షన్) భూమి విస్తరణలో NH 63 పరిధిలోకి వచ్చే కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించే భూమి సంక్షిప్త వివరణ.

ఇంగ్లీష్ మరియు హిందీలో నోటిఫికేషన్ కొరకు స్కాన్ చేయండి | తెలుగులో నోటిఫికేషన్ కొరకు స్కాన్ చేయండి

జిల్లా: నిజామాబాద్
ప్రచురణ తేది: 15-10-2024

[F. No. NHAI/PIU/MNCL/AJM/2024/3a-01/3D]
అభయ్ జైన్, డైరెక్టర్

https://egazette.gov.in
https://morth.gov.in/
https://bhoomirashi.gov.in/auth/revamp/showFileDf.cshtml?notification_id=56611&file_id=28304

సం/-
రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్
మరియు సమర్థ ప్రాధికారి భూ సేకరణ కొరకు (CALA) NHAI, ఆర్మూర్ (NH 63)

గల్లీకో 'బెల్టు'.. ఆమ్దానీకిదే రూటు!

- **బెల్టు తీస్తామంటూ అధికారంలోకి కాంగ్రెస్**
- **ఆదాయం కోసం మద్యం విక్రయాలకు ప్రోత్సాహం**
- **కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉపాధి హామీగా బెల్టు షాప్‌లు**
- **రాష్ట్రవ్యాప్తంగా 1.75 లక్షలకు పెరిగిన బెల్టు దుకాణాలు**
- **బెల్టుల ద్వారానే 70 శాతం విక్రయాలు**
- **ఎమ్మార్పీ మీద రూ.20 నుంచి రూ.100 వరకు వసూలు**

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): బెల్టు షాప్‌లను తొలగిస్తామన్న హామీతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నది. పది నెలల కాలంలో పల్లెల్లో 120 శాతం బెల్టు షాపులు కొత్తగా ఏర్పడినట్టు తెలిసింది. ఉపాధి అడిగిన ప్రతి కార్యకర్తకు స్థానిక ఎమ్మెల్యేలు బెల్టు దుకాణాలనే మార్గంగా చూపిస్తున్నారట. ఇటీవల ఓ అధికారిని ఆరా తీయగా రాష్ట్రంలో 1.75 లక్షల బెల్టు షాపులున్నట్టు వెల్లడించారు.

ఒకరి ఏరియాలోకి మరొకరు రావొద్దు

ఎక్సైజ్ అధికారులు ఏ4 దుకాణాల వారీగా గ్రామాలు, హద్దులు నిర్ణయించారు. ఒక దుకాణానికి కేటాయించిన గ్రామంలోని బెల్టు షాపుకు మరొక లైసెన్స్‌డ్ దుకాణదారుడు మద్యం అమ్ముకూడదు. బాటిల్ పక్క మండలంలోని మద్యం దుకాణానికి చెందినది అని తేలితే ప్రైవేటు సైన్యం అక్కడికక్కడ మద్యం సీజ్ చేస్తుంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మపూరంలో 2300 మంది జనాభా ఉండగా.. ఇక్కడ 10 బెల్టు షాపులున్నాయి. రోజుకు కనీసం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వ్యాపారం జరుగుతుంది. ఎక్సైజ్ అధికారులు ఈ గ్రామాన్ని దుబ్బాక మండలం హబ్సీపూర్‌లో ఉన్న ఏ4 దుకాణానికి అనుసంధానం చేశారు. తిమ్మపూర్‌కు సమీపంలో సిద్దిపేట మెయిన్ రోడ్డుపై ఇర్కోడ్ అనే మరో గ్రామం ఉంది. దుకాణదారులు సిద్దిపేట పట్టణానికి రాకపోకలు చేసే క్రమంలో ఇర్కోడ్ ఏ4 షాపులో మద్యం కొంటారు. ప్రైవేటు సైన్యాలు దీన్ని గుర్తించి, మద్యం సీసాలను జప్తుచేశాయి. గ్రామస్థులు అడ్డుకోవడంతో గొడవ అయింది.

రోజుకు రూ.86 కోట్ల వ్యాపారం

ఎక్సైజ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో రోజుకు రూ.116 కోట్ల చొప్పున నెలకు రూ.3,500 కోట్ల మద్యం వ్యాపారం జరుగుతున్నది. రోజుకు సగటున 70 లక్షల సీసాల మద్యం అమ్ముడవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 2,620 రిటైల్ మద్యం దుకాణాలు, 1200 బార్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లోని 615 రిటైల్ దుకాణాలకు పెద్దగా బెల్టు షాప్‌లు లేవు. మిగిలిన 2005 దుకాణాలకు 1.75 లక్షల బెల్టు షాపులున్నాయి. ఒక్కో రిటైల్ షాపుకు అనుబంధంగా సగటున 85 బెల్టు షాపులు నడుస్తున్నాయి. మద్యం దుకాణాలు, బార్లలో కలిపి రూ.30 కోట్ల వ్యాపారం జరిగితే.. మిగిలిన రూ.86 కోట్ల మద్యం వ్యాపారం బెల్టు దుకాణాల ద్వారానే అవుతున్నది.

ఆంతర్యం ఇదే

ఏ4 రిటైల్ దుకాణంలో ఎమ్మార్పీకే మద్యం అమ్మాలి. వ్యాపారులు లాభాల కోసం బెల్టు షాపుల మీద ఆధారపడుతున్నారు. బెల్ట్ షాపులకు క్వార్టర్ బాటిల్ ఎమ్మార్పీ మీద రూ.10, ఫుల్ బాటిల్‌కు రూ.50 చొప్పున అదనపు ధరకు విక్రయిస్తున్నారు. ఇక బెల్ట్ షాప్ ఓనర్లు మరో రూ.10 నుంచి రూ.50 లాభానికి విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఎమ్మార్పీ మీద రూ.20 నుంచి రూ.100 వరకు ఉల్లంఘన జరుగుతున్నది. అక్రమ మద్యాన్ని అరికట్టడమే కాకుండా ఎమ్మార్పీ ఉల్లంఘను నివారించటం ఎక్సైజ్ శాఖ, జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్), స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్), ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల పని. కానీ ఈ విభాగాలన్నీ ఎమ్మార్పీ ఉల్లంఘనను అరికట్టలేకపోతున్నాయి. ఇందుకు వారికి ప్రతి నెలా మామూళ్లు అందటమేనన్న ఆరోపణలు వినిపిస్తున్